
# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!




# కాంగ్రెస్ వస్తే మళ్లీ వలసలే..

- ధరణి లేకుంటే భూములకు భద్రత ప్రశ్నార్థకం
- పెరిగిన భూముల ధరలు మళ్లీ పతనం
- కరెంటు లేకుంటే గణనీయంగా తగ్గిపోనున్న సాగు విస్తీర్ణం
- ఎత్తిపోతల పథకాలకు మంగళం?
- ధైర్యంగా బతుకుతున్న రైతులు ఆగం
- అన్నిరంగాలు.. అందరిపైనా ప్రభావం

## గ్రామీణ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం

**జనగామ, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ) : గడిచిన పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం శక్తివంచన లేకుండా వ్యవసాయ రంగ అభివృద్ధి కోసం చేసిన కృషితో భుముల ధర అమాంతం పెరిగిందనేది జగమెరిగిన సత్యం. అయితే కాంగ్రెస్ చెబుతున్న మాటలు చూస్తుంటే మళ్లీ వ్యవసాయ రంగం కుదేలయ్యేలా ఉందని, రైతులు ఆత్మస్థయిర్యం కోల్పోయే ప్రమాదముందనే అభిప్రాయాలు వెల్లువెత్తుతున్నాయి. నిరంతర కరెంటు పోయి, 10హెచ్‌పీ మోటర్లు వచ్చి ధరణి ఎత్తేసి, కౌలుదారు కాలమ్ వచ్చి, రైతుబంధుపై నీలినీడలు కమ్మితే రాష్ట్రంలో భూముల ధరలు పడిపోతాయని, ధరణి లేకుంటే భూములకు రక్షణే లేకుండా పోతుందనే వాదనలు వినిపిస్తున్నాయి. తిరిగి పట్వారీల ఆజమాయిషీ వస్తే రైతుల్లో భూములపై ఇప్పుడున్న ధీమా పోతుందని, కౌలుదారు కాలమ్ భయంతో స్వయంగా వ్యవసాయం చేయలేనివారు భూమిని బీడు పెడుతారు తప్ప కౌలుకు ఇవ్వరని, ఫలితంగా సాగు పడిపోతుందని రైతుసంఘాల నాయకులు అంటున్నారు.**

సాగు తగ్గిపోతే ఆహార భద్రతకు ముప్పు ఏర్పడుతుందంటున్నారు. గ్రామాల్లో 70శాతం వ్యవసాయం మీద ఆధార పడ్డ కుటుంబాలవారు ఆదాయం కోల్పోతారని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుందని చెబుతున్నారు. మూడు గంటల కరెంటు వల్ల సాగుకు నీరు సరిపోక ఈ రకంగా చూసినా సాగు విస్తీర్ణం మీద దెబ్బపడుతుందని స్పష్టం చేస్తునారు. 10హెచ్‌పీ మోటర్ల వల్ల రైతులమీద అదనపు భారం పడుతుందని వాపోతున్నారు. రైతుబంధులో కౌలుదారులు, రైతుల పంచాయితీలతో గ్రామాల్లో శాంతిభద్రతల ముప్పు వాటిల్లే ప్రమాదముందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. కరెంటు తీసేయడం, భూమికి భద్రత లేకుండా చేయడం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడం, సాగు విస్తీర్ణం పడిపోవడం ద్వారా భూముల ధరలు పతనమవుతాయని అంటున్నారు. ఇప్పుడు రెండు, మూడెకరాల రైతులకు కూడా భూముల ధరలు ఎంత భరోసాను, ధీమాను ఇస్తున్నాయని, ఫలితంగా రైతు ఆత్మహత్యలు ఆగిపోయాయని, గతంలో భూములకు పెద్ద ధరలు లేక కొద్దిపాటి అప్పులకు కూడా భయపడి ఆత్మహత్యలకు పాల్పడేవారని గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు భూముల ధరలు పెరిగాక అప్పులమీద భయం పోయిందని, రైతుల్లో ధీమా వచ్చిందని చెబుతున్నారు. ధరలు మళ్లీ పాతరోజులు వస్తాయని అంటున్నారు. తెలంగాణలో చిన్న కమతాలున్న కుటుంబాలవారు అనేక మంది దూరంగా ఎక్కడో ఉద్యోగాలు చేసుకుంటూ గ్రామాల్లోని తమ భూములను కౌలుకిచ్చి వ్యవసాయం చేయిస్తున్నారని, అంతే తప్ప కౌలుకు ఇచ్చే రైతులంతా వందల ఎకరాలున్న వారేం కాదని, చిన్న, మధ్య తరగతి ఉద్యోగులను ఈ సమస్యలన్నీ చుట్టుముడితే చిరుద్యోగులకు ఎంతో కొంత ఆసరా అయ్యే ఈ అదనపు ఆదాయం కూడా కోల్పోతారని అభిప్రాయపడుతున్నారు. గ్రామాల్లో వ్యవసాయ పనులు లేకపోతే మళ్లీ వలసలు మొదలవుతాయని, రైతుకిచ్చే కరెంటునే కుదించే కాంగ్రెస్, కోట్ల రూపాయలు పోసి ఎత్తిపోతల పథకాలను పూర్తి స్థాయిలో నడిపిస్తుందా? అని ప్రశ్నిస్తున్నారు. రైతులకు ఉచిత విద్యుత్ కోసం దాదాపు 10వేల కోట్ల దాకా విద్యుత్ సంస్థలకు సబ్సిడీ ఇస్తున్నారని, కాంగ్రెస్‌కు ఇంత సొమ్ము ఇచ్చే గుండె ధైర్యం ఉంటుందా? అనేది ప్రశ్నార్థకమేనంటున్నారు. పదేండ్ల కాలంగా కేసీఆర్ కష్టపడి నిర్మించిన గ్రామీణ వ్యవస్థ దెబ్బతింటుందని, ఈ వ్యవస్థను నిలబెట్టేందుకు చెరువులు, కుంటలు, సాగునీటి ప్రాజెక్టులు, విద్యుత్ సబ్‌స్టేషన్లు, జాతీయ గ్రిడ్‌తో అనుసంధానం, విత్తనాలు, ఎరువులు అందుబాటులోకి తెచ్చేందుకు ఏర్పాటు చేసిన వ్యవస్థ, గోదాముల నిర్మాణం, మార్కెట్ యార్డుల విస్తరణ, రైతువేదికల శిక్షణ సమాచార వ్యవస్థ అన్నీ బూడిదలో పోసిన పన్నీరవుతాయంటున్నారు. ఒక్కొక్కటిగా పేర్చి నిర్మించిన వ్యవస్థ కుప్పకూలుతుందని ఆందోళన చెందుతున్నారు.



## రేవంత్ రెడ్డి మాటలు నమ్మితే ఆత్మహత్యలే..

జనగామ రూరల్, నవంబర్ 26 : కాంగ్రెస్ హయాంలో కరెంట్ సమస్యలతో తీవ్ర ఇబ్బదులు పడ్డం. కరెంట్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియక నానా తంటాలు పడేవాళ్లం. రాత్రిపూట కరెంట్‌తో బావుల వద్ద పాములు, తేళ్లతో సంసారం చేశాం. భయంభయంగా బతికేవాళ్లం. స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రభుత్వంలో రైతుల బతుకులు మారాయి. ఇప్పుడిప్పుడే రైతులు మొఖం తెలివి వస్తుంటే కాంగ్రెస్ రైతులకు 3గంటల కరెంట్ చాలంటున్న రేవంత్‌రెడ్డి మాటలు నమ్మితే రైతులకు ఆత్మహత్యలే శరణ్యం. 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలంటున్న రేవంత్‌రెడ్డికి వ్యవసాయంపై రవ్వంత కూడా అవగాహన లేదు. 10హెచ్‌పీ మోటర్ కొనాలంటేనే రూ.లక్షల ఖర్చు అవుతుంది. రేవంత్‌రెడ్డి మాటలు నమ్మితే రైతులు నిండా మునుగుతారు. రైతుల బతుకులు బజారున పడేయవద్దు. కేసీఆర్ సార్ ఇస్తున్న 24గంటల కరెంట్, రైతుబీమా, రైతుబంధు పథకాలతో రైతులంతా సంతోషంగా ఉన్నారు. రైతులు రాజులు కావాలంటే సీఎం కేసీఆర్‌తోనే సాధ్యం.

**– గుజ్జుల సంపత్, రైతు, పెంబర్తి**

## మళ్లీ కరెంట్ బాధలు భరించలేం..



పాలకుర్తి, నవంబర్ 26 : గత పాలకుల నిర్లక్ష్యం వల్ల కరెంటుతో బాధలు పడ్డాం. కరెంట్ కోతల వల్ల వేసిన పంటలు ఎండి పోవడం.. పెట్టిన పెట్టుబడి రాక పంట దిగుబడి లేక రైతులు నానా గోస పడ్డారు. కరెంట్ కోసం రోడ్లపై సబ్‌స్టేషన ముందు ఎండిన వరి గడ్డితో నిరసన ఆందోళన చేసిన రోజులు ఉండేవి. బావుల్లో నీరున్నా ఎకరం రెండెకరాలు పారుడే కష్టంగా ఉండేది. తెలంగాణ వచ్చాక సీఎం కేసీఆర్ 24గంటల కరెంటు ఇస్తున్నారు. నాణ్యమైన కరెంటుతో రెండు పంటలు పండించుకుంటున్నారు. ఎండిన పొలాలు కన్పించడంలేదు. సబ్‌స్టేషన్‌ల ముందు ధర్నాలు, ఆందోళనలు లేవు. రైతుల కోసం ఆలోచన చేసే గొప్ప వ్యక్తి కేసీఆర్. కాంగ్రెసోళ్ల 10హెచ్‌పీ మోటర్లు పెట్టాలంటున్నారు. ఇది సాధ్యం కాదు. సన్న, చిన్న కారు రైతులు 24గంటల కరెంట్‌తో హాయిగా పంటలు పండిస్తున్నారు. 10హెచ్ మోటర్లు బిగిస్తే ఖర్చు ఎక్కువ అవుతుంది. బోర్లు ఎండిపోయే పరిస్థితి వస్తుంది. మూడు గంటల కరెంటు ఇస్తే నీరు సరిపోక పంటలు ఎండిపోతాయి. కరెంటు కష్టాలు మళ్లీ మొదలవుతాయి. 24గంటల కరెంటుతో రంది లేకుండా బదుకుతున్నం. రైతులం ఎట్లా మర్చిపోతం.

**–అంకిరెడ్డి సుధాకర్‌రెడ్డి, రైతు, మల్లంపల్లి, పాలకుర్తి**



## 'కరెంట్'తో వ్యాపారం పుంజుకుంది

జనగామ చౌరస్తా, నవంబర్ 26 : బేకరిలో రకరకాల ఫుడ్ ఐటెమ్స్ తయారు చేయాలన్నా, వాటిని నిల్వ ఉంచాలన్నా మాకు కరెంట్ తప్పనిసరిగా అవసరం. ఒక్క మాటలో చెప్పాలంటే కరెంట్‌తో మా బిజినెస్ కనెక్ట్ అయి ఉంటుంది. గత ప్రభుత్వాల హయాంలో రోజుకి మూడు, నాలుగు గంటలే కరెంట్ ఇచ్చేది. దీంతో మా బిజినెస్ బాగా దెబ్బతినేది. ఇవాళ కరెంట్ పోవడమనేది చాలా తక్కువ. ఎలక్ట్రానిక్ ఓవెన్ (బట్టి) సహాయంతో కేకులు, ఎగ్ పప్స్, కర్రీ పప్స్, పిజ్జాలు, బర్గర్లు, బ్రెడ్‌లు తయారు చేసి విక్రయిస్తున్నాం. కస్టమర్లను ఆకర్షించడానికి బేకరి లోపల, బయట విద్యుత్ కాంతులు విరజిమ్మేలా ఎలక్ట్రిక్ బల్బ్‌లతో అలంకరిస్తున్నాం. దీంతో వినియోగదారుల తాకిడి పెరిగి అందరి వ్యాపారాలు పుంజుకున్నాయి.

**–ఎండీ జహీర్ అహ్మద్, బేకరీ నిర్వాహకుడు, జనగామ**

తెలంగాణ వ్యవసాయాన్ని దేశచిత్రపటంలో పెట్టినోళ్లకా?

ఎకరం పారకానికి ఎన్ని గంటల కరెంటు కావాలో తెల్వనోళ్లకా?

**నీ ఓటు ఎవరికి?**

**తెలంగాణమా తేల్చుకో**

## కాంగ్రెస్‌తో కరెంటు కష్టాలు తప్పవు..



కొడకండ్ల, నవంబర్ 26 : మూడు గంటల కరెంట్‌తో రైతులకు మళ్లీ పాత కరెంట్ కష్టాలు వచ్చినట్లే. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు 24గంటల కరెంట్ ఇవ్వడంతో రైతులు సంతోషంగా జీవిస్తున్నారు. కాంగ్రెస్ హయాంలో సమయానికి కరెంట్ లేక పంటలు ఎండిపోయి. రైతులు చాలా నష్టపోయారు. గతంలో రాత్రి పూట పొలం కాడే పడుకునేవాళ్లం. కాంగ్రెస్ మళ్లీ వస్తే పాత రోజులు వస్తయ్. కాంగ్రెస్ పాలన మాకొద్దు. కేసీఆర్ సారు ఇస్తున్న 24గంటల కరెంట్ ముద్దు. కాంగ్రెస్ గ్యారంటీలపై నమ్మకం లేదు. కర్ణాటక రైతులు పడుతున్న బాధలు మాకొద్దు. కరెంట్ కోసం పడిగాపులు కాసే ప్రభుత్వం మాకొద్దు. రేవంత్‌రెడ్డికి రైతులపై అవగాహన లేదు.

**– బండారి సోమన్న, కొడకండ్ల**

## కరెంట్ లేకపోతే వ్యవసాయం దండగే..

వేలేరు : వ్యవసాయానికి సాగునీరు, కరెంట్ ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలె. తెలంగాణలో రైతులు బాగుండాలనే సీఎం కేసీఆర్ రైతులకు సాగునీరు, 24 గంటల కరెంట్ ఇస్తుంద్రు. రైతులకు సమృద్ధిగా సాగునీరు, కరెంట్ అందుతుండడంతో రైతులు మంచిగా పంటలు పండించుకుంటూ కొంతమేర ఆర్థికంగా ఎదుగుతున్నరు. అదే కాంగ్రెస్ నాయకులు రైతులకు మూడు గంటలే కరెంట్ చాలని దిమాక్‌లేని మాటలు మాట్లాడుతున్నరు. మూడు గంటల కరెంట్‌తో రైతులు పంటలు ఏట్లా పండిస్తరు. సీఎం కేసీఆర్ ముందుచూపుతో రాష్ట్రంలో సాగునీరుకు కొదవ లేకుండా ఉంది. కానీ సాగునీరు ఉన్న కరెంట్ లేకపోతే చేన్లకు నీళ్లు పారిచ్చుండు. కరెంట్ ఉంటేనే కదా మోటర్ పెట్టి చేన్లకు నీళ్లు కట్టుడు. రైతులకు మూడు గంటల కరెంట్ చాలు అన్న కాంగ్రెస్ నాయకులు పిచ్చి పట్టి మాట్లాడుతున్నరు. రైతుల కష్టాలు తెలిసినోళ్లు అయితే గిట్లా మాట్లాడరు. రైతుల కష్టం తెలిసిన సీఎం కేసీఆర్‌నే గెలిపించుకుంటాం.

**– భట్టు ప్రభాకర్, మల్లికుదుర్ల గ్రామం, వేలేరు**





## భూముల విలువ పడిపోతుంది..

నర్సంపేట, నవంబర్ 27 : రైతులు, కౌలు రైతులకు మధ్యన వివాదాలు వస్తాయి. రైతుబంధును కౌలు రైతులు, రైతుల్లో ఎవ్వరికైనా ఒకరికే ఇస్తామని కాంగ్రెస్ నాయకులు అంటున్నారు. దీని వల్ల రైతులు, కౌలు రైతులుకు మధ్య గొడవలు జరిగి, శాంతిభద్రతల సమస్యలు ఏర్పడతాయి. కరెంటు మూడు గంటలే ఇస్తామని చెప్పడం విడ్డూరంగా ఉంది. కాంగ్రెస్ నాయకులను నమ్మి రైతులు వ్యవసాయం చేయలేరు. రైతుల భూములకు విలువ కూడా బాగా తగ్గిపోతాయి. సీఎం కేసీఆర్ పాలనలోనే పుష్కలంగా సాగునీరు, విద్యుత్‌తో పాటు రైతుబంధు ఇవ్వడంతో భూములకు విలువ పెరిగి, రైతులు భరోసాతో బతుకుతున్నారు. రైతుబంధుతో రైతులకు ఎంతో ఉపయోగపడింది. ఇప్పుడు ధరణి ఎత్తేస్తామని, సీఎం కేసీఆర్ డబ్బులను వృథా చేస్తున్నారని అంటున్నారు. ఇలా కాంగ్రెస్ నాయకులు మాట్లాడడం కరెక్ట్ కాదు. దీని వల్ల నష్టపోయేది రైతులే. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గట్టిగా బుద్ధి చెప్పాలి. రైతులందరూ బీఆర్ఎస్‌కు మద్దతుగా నిలవాలి.

**- కొమ్ము రమేశ్‌యాదవ్, న్యాయవాది**


## ధరణి తీసేస్తే సర్వే నంబర్ వెతుక్కోవాలి

స్టేషన్ ఘన్‌పూర్, నవంబర్ 26 : ధరణి రాకముందు, గ్రామాల్లో వీఆర్వోలు సర్వే నంబర్లు మార్చి రైతులను సర్వతిప్పలు పెట్టింద్రు. భూమి అమ్మాలన్నా, కొనాలన్నా ముందుగా పహణి తీస్తే సర్వే నంబర్లు మారేవి.. భూమి ఒకచోట, సర్వే నంబర్ మరోచోట కావడంతో రైతులు వ్యవసాయాన్ని వదిలి వీఆర్వోల చుట్టూ తిరగాల్సి వచ్చేది. పైసలు ఖర్చు పెట్టుకున్నా కూడా నెలల తరబడి తిరిగినా పని కాకపోయేది. వీఆర్వోలు తమ ఆదాయం కోసం, అమాయకులైన రైతులను, చదువురాని వారి భూముల సర్వే నంబర్లు మార్చడంతో చాలా ఇబ్బందులు పడ్డారు. కానీ, సీఎం కేసీఆర్ ధరణి తీసుకురావడంతో రైతు వేలు పెట్టకుండా రైతుల భూములు మాయం చేయడం, ఒకరి భూములు ఒకరికి రాయడం ఏ అధికారి వల్లా కాదు. ధరణి అంతా మంచిగున్నది. రైతు ఎక్కడున్నా తన భూమిని సెల్‌ఫోన్లో చూసుకోవచ్చు. గిట్ల రైతులపై మంచి చేసేవారిని ఎవరైనా కోరుకుంటరు. కానీ, రైతులను ఆగం చేయాలనుకునే కాంగ్రెస్‌ను ఖతం చేయాలని చూస్తరు.

**–గోవిందు వెంకటనర్సు, రైతు, కొత్తపల్లి**



## 'ధరణి'తో సులువుగా రిజిస్ట్రేషన్



జనగామ చౌరస్తా, నవంబర్ 26 : గతంలో వ్యవసాయ భూములు మన పేరుమీద చేసుకోవడానికి ఆఫీసుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగేది. అధికారులు ఒకరు అందుబాటులో ఉంటే ఇంకొకరు ఉండకపోయేది. పొలం పనులు ఇడిసిపెట్టి రైతులు పడిగాపుల పడుకుంటా భూమి పట్టా పాసు పుస్తకాల కోసం నెలల తరబడి ఎదురుచూసేది. 'ధరణి' వచ్చాక ఆ పరిస్థితి పూర్తిగా మారింది. మనకు వీలున్న రోజు, అనుకున్న సమయానికి రిజిస్ట్రేషన్ కోసం ఆన్‌లైన్‌లో స్లాట్ బుకింగ్ చేసుకుంటున్నం. 'ధరణి'తో సులభంగా రిజిస్ట్రేషన్ అయితంది. వారం, పదిరోజుల్లో కొత్త పట్టా పాసు పుస్తకం రైతుల ఇంటికే వస్తంది. భూమి ఉన్న ప్రతిఒక్కరికీ పెట్టుబడి సాయం కింద రైతుబంధు సాయం కూడా అందుతంది. సీఎం కేసీఆర్ రైతుల పక్షపాతి కాబట్టే ముందు చూపుతో రైతులకు ఏ కష్టం రాకుండా ఆదుకుంటుండు. పెద్దాయన (కేసీఆర్)కు రైతులంతా రుణపడి ఉంటరు.

**–కంజర్ల మురళి, ఆదర్శ రైతు, గోవర్ధనగిరి**



## వ్యవసాయాన్ని ఆగం చేస్తామంటుర్రు..

కొడకండ్ల, నవంబర్ 27 : తెలంగాణ వచ్చినంక కేసీఆర్ సారు 24గంటల కరెంటు తెచ్చిండు. నీళ్లు తెచ్చిండు. రైతు బంధు ఇచ్చిండు. అన్ని సౌలతులు ఏర్పాటు చేసి, దండుగ లెక్క ఉన్న వ్యవసాయాన్ని, పండుగ చేశిండు. అట్లాంటి దాన్ని మళ్లా ఆగం చేయడానికి కాంగ్రెసోళ్లు కంకణం కట్టుకున్నరు. అందుకే కాంగ్రెసోళ్లు మూడు గంటల కరెంటు, 10హెచ్‌పి మోటర్లు, రైతు బంధు కౌలుదారులకు ఇస్తాం అనుడు ఇవ్వన్నీ చూస్తే అర్థం అయితాంది. రైతన్నను ఆగం చేయడానికి వాళ్లు వస్తుర్రు అని. మాకు 10హెచ్‌పి మోటర్లు లేవు. మూడు గంటల కరెంటు సరిపోదు. మాకు కాంగ్రెస్ పాలన వద్దు. మా రైతన్నలకు మేలు చేసిన కేసీఆర్‌సారుకే అండగా ఉంటాం ఎర్రబెల్లి దయాకర్‌రావుకే మా మద్దతు.

**–కప్పల రాజాలు, రైతు, నర్సింగాపురం, కొడకండ్ల**

## కాంగ్రెస్‌కు ఓట్లేస్తే కష్టాలే..



బచ్చన్నపేట, నవంబర్ 27 : తెలంగాణలో 24 గంటల కరెంటు వ్యవసాయానికి ఇస్తున్న కేసీఆర్‌ను కాదని కాంగ్రెస్‌ను గెలిపిస్తే అన్నంను కాళ్ల దన్నుకున్నట్టే. నియ్యత్ ఉంటే బర్కత్ ఉంటది. కేసీఆర్ ఇచ్చే పథకాలను అనుభవిస్తున్నం. తిన్న రేవు తలువాలే. అది మర్చి కాంగ్రెస్‌ను ఆదరిస్తే 3 గంటల కరెంటే వస్తది. పథకాలన్నీ ఆగిపోతయ్. ఉన్న కరెంటును కర్ణాటకు తరలిస్తరు. మళ్లీ పాత రోజులు వస్తయి. రాత్రిపూట బాయికాడికి పోవాలే. ఎప్పుడు వస్తదో తెలియదు. ఎప్పుడు పోతదో తెలియని కరెంటుతో మనం కష్టాలు పడాల్సిందే. రైతులు ఆలోచన చేయాలే. రైతు కోసం మంచి చేసిందెవరూ.. రేపు చేయబోదెవరో అని నిర్ణయం తీసుకోవాలి. ఎవ్వడో వచ్చి చెప్పితే నమ్మొద్దు. అన్నం పెట్టే కేసీఆర్‌ను దూరం చేసుకోవద్దు. అరవై ఏండ్లు పాలించిన కాంగ్రెస్ ఇవన్నీ ఇచ్చిందా అలోచన చేయాలే. 3గంటల కరెంటుతో పొలం పారుతదా...? కేసీఆర్ ఇచ్చే కరెంటుతో రెండు పంటలు పుష్కలంగా పండుతున్నయ్. ఇప్పుడిప్పుడే బాగుపడుతున్నం. మరో ఐదేళ్లు బీఆర్ఎస్‌కు అధికారం ఇస్తే మన కష్టాలు తొలగిపోతయ్.

**– ఆత్కూరి కనకయ్య, కొడవటూరు, బచ్చన్నపేట మండలం**

